క్లుప్తంగా

డిగ్రీలో ప్రవేశాలకు ఆహ్వానం

గజపతినగరం రూరల్: నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యనభ్యసించేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ మంగళవారం తెలిపారు. ఎటువంటి ఫీజు లేకుండా వసతిగృహం సదుపాయంతో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో, అధునాతనమైన ల్యాబ్ పరికరాలతో పూర్తిస్థాయి ఐదు గ్రూపుల్లో విద్యను అభ్యసించేందుకు విద్యార్థులకు ఆహ్వానం పలుకుతున్నామని తెలిపారు. ప్రతీ ఏడాది మెగా జాబ్‌మేళా నిర్వహించి విద్యార్థులకు ఆయా కంపెనీలలో ఉద్యోగ ఉపాధి అవకాశాలను కూడా కల్పించనున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఖాతాదారులు బీమా చేయించుకోవాలి


ఖాతాదారులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తున్న ఏపీజీవీబీ మేనేజర్

గుర్ల: ఖాతాదారులందరికి బీమా తప్పనిసరిగా ఉండాలని ఏపీజీవీబీ మేనేజర్ యు.రాంప్రసాద్ సూచించారు. మండలంలోని పాలవలసలో ఆర్థిక అక్షరాస్యతపై మంగళవారం ఆయన అవగాహన కార్యక్రమం చేపట్టారు. పీఎం సురక్ష యోజన వంటి బీమా పథకంలో చేరాలన్నారు. సైబర్ స్కాంలపై అవగాహన పెంచుకోవాలని, బ్యాంకు అధికారులు వారి వ్యక్తిగత ఖాతా వివరాలు అడగరని తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పాట్నూరు సన్యాసినాయుడు, మాజీ ఎంపీటీసీ బూర్లె శ్రీనివాసరావు, బ్యాంకు మిత్ర వల్లూరి నరసింహమూర్తి , పాల్గొన్నారు.

పరామర్శ


సాంబ కుటుంబ సభ్యులను పరామర్శించిన అప్పలనరసయ్య, సురేష్‌బాబు

గంట్యాడ: మండలంలోని రామభద్రపురం సర్పంచ్ కర్రి సాంబ సోమవారం రాత్రి మృతి చెందారు. ఆయన భౌతిక కాయాన్ని మంగళవారం గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు సందర్శించారు. సాంబ కుటుంబ సభ్యులను పరామర్శించి వారిని ఓదార్చారు. పరామర్శించిన వారిలో జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు జాగరపు అప్పారావు తదితరులు ఉన్నారు.

అమ్మ పాదాల ప్రతిష్ఠోత్సవం

శృంగవరపుకోట: పట్టణంలోని గ్రామదేవత దారగంగమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారి పాదాల ప్రతిష్ఠ ఉత్సవం నిర్వహించారు. విశాఖకు చెందిన బంటుమిల్లి అప్పన్న కుమారులు అప్పలరాజు, శంకరరావు నిర్మాణం చేయించిన ఆలయ సింహద్వారాన్ని వేదోక్తంగా ప్రారంభించారు. అమ్మవారి పాదాలను తయారు చేయించిన కొమ్మోజు శ్రీను, ఎలమంచిలి ఈశ్వరరావు తదితరులచే శాస్త్రోక్తంగా పూజలు చేయించి ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

పశుగ్రాస విత్తనాలు సిద్ధం

వేపాడ: పాడి రైతులకు 75శాతం రాయితీపై గడ్డి విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని పశువైద్యాధికారిణి కొటాన గాయత్రి చెప్పారు. వేపాడ మండలానికి 400కిట్లు సీఎస్‌హెచ్ 24 ఎం.ఎఫ్ జొన్న విత్తనాలు వచ్చాయన్నారు. 5కిలోల బ్యాగ్ ఖరీదు రూ.460 కాగా 75శాతం రాయితీ పోగా రైతులు రూ.115లు చెల్లించాల్సి ఉందన్నారు. ప్రతి ఆర్.ఎస్.కెలో విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఆమె చెప్పారు.

మండల సమాఖ్య సమావేశం

గజపతినగరం: వార్షిక రుణ మరియు జీవనోపాదుల ప్రణాళికల తయారీపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు వెలుగు ఏపీఎం నారాయణ రావు తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో వీవోఏలు, ఎన్యుమరేటర్‌లకు మంగళవారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు సూచనలు సలహాలు ఇచ్చారు. డ్వాక్రా సంఘ మహిళలకు జమ, చెల్లింపులు, ఆదాయం, ఖర్చులు, స్త్రీనిధి, బ్యాంకు లింకేజి అప్పులు తదితర వంటి వాటిపై పూర్తిగా అవగాహన కలిగేలా చేయాలని చెప్పారు. పొదుపు మహిళలు తమ వద్ద ఉన్న రికార్డులను పారదర్శకంగా మెయింటైన్ చేస్తూ ఎటువంటి తప్పులు లేకుండా చూసుకోవాలన్నారు. పలువురు సీసీలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

వేపాడ: మండలంలోని బానాది గ్రామంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో సత్యసాయి సేవా సంస్థ విజయనగరం జోన్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. శిబిరంలో 86 మందికి పరీక్షలు చేసి 34 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో శ్రీను, సన్యాసినాయుడు, ఆప్తాలమిక్ అసిస్టెంట్ దివ్య ప్రశాంతి, మేనేజర్ ఎం.అరుణ్‌కుమార్, భాను పాల్గొన్నారు.

రహదారి కోసం ఆందోళన

- ఆర్నెళ్లుగా హామీలే తప్ప పనులు లేవు..
- నిధులున్నా ఉపయోగం సున్నా..


బొడ్డవర - చిట్టంపాడు రోడ్డు వేయాలంటూ బైఠాయించిన గిరిజనులు

శంగవరపుకోట: 'అంగట్లో అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని ఉంది..' అన్న సామెత చందంగా ఉంది మూలబొడ్డవర పంచాయతీలో గిరిశిఖర గ్రామాల్లో ఉన్న గిరిజనం తీరు. అనుమతులు తెచ్చేస్తాం.. అన్ని వసతులు ఇచ్చేస్తాం.. అన్న ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారుల హామీలు గాలి వాటానికి ఎగిరిపోయాయి. ప్రజాప్రతినిధులు మోసకారి మాటలు, జిల్లా అధికారుల చేతకాని చేతలతో విసిగిపోయిన గిరిజనం రోడ్డు కోసం మంగళవారం రోడ్డెక్కారు. మూలబొడ్డవర పంచాయతీలో బొడ్డవర జంక్షన్ నుంచి చిట్టంపాడు వరకూ ఉన్న 10కి.మీ రహదారిని బాగు చేసి 10 గిరిజన గ్రామాలైన అమ్మపాలెం, మెట్టపాలెం, లక్ష్మీపురం, బొడ్డపాడు, చెలకపాడు, చిట్టంపాడు, గాదెల్లోవ, కొత్త గూనపాడు, పాతగూనపాడు, చిట్టంపాడు గ్రామాల్లోని గిరిజనం ఇబ్బందులు తీర్చాలని గిరిజనం ఏళ్లుగా విన్నవిస్తూనే ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో రోడ్డు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపగా పి.ఎం. జన్‌మన్ కార్యక్రమంలో రోడ్డు ఏర్పాటుకు రూ.11.30కోట్లు మంజూరు చేశారు. తర్వాత ఎన్నికల హడావిడితో ప్రతిపాదనలు పడకేశాయి. ఇటీవల అధికారులు ఎం.పి, ఎమ్మెల్యేలను పిలిచి రోడ్డు వేస్తున్నామోచ్.. అని కొబ్బరి కాయలు కొట్టించేసి, భూమి పూజలు చేయించేశారు. తర్వాత రోడ్డు ఊసెత్తలేదు. గోతులు మయమై, రాళ్లు తేలిపోయి, ఆటోలు, అంబులెన్స్‌లు కూడా వెళ్లేందుకు అవకాశం లేని రోడ్డులో నిత్యం పడుతూ, లేస్తూ అవస్థలు పడుతున్న గిరిజనం మంగళవారం ఏపీ గిరిజన సంఘం జిల్లా బాధ్యులు జె.గౌరీష్, మూలబొడ్డవర సర్పంచ్ డి.మీనాల నేతత్వంలో పది గ్రామాలకు చెందిన పలువురు గిరిజనులు, మహిళలతో కలసి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. బొడ్డపాడు వరకైనా రోడ్డు వేయాలని, లేదా వెట్‌మిక్స్ వేసి గోతులు కప్పి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో కేత వీరన్న, వార్డు సభ్యులు కొర్రా సోమన్నదొర, ఆల్తి బాబూరావు, పెంటకోట వెంకటరమణతో పాటూ పలు గ్రామాల గిరిజన యువకులు, మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇదిలా ఉండగా ఈ విషయమై పీఐయూ ఏఈఈ ఐశ్వర్య వద్ద ప్రస్తావించగా బొడ్డపాడు నుంచి పైనున్న రోడ్డుకు అటవీ శాఖ అనుమతులు రావాలని చెప్పారు. రైల్వే ట్రాక్ స్థానంలో రైల్వే అధికారులు సబ్‌వే నిర్మాణం చేయాలని, వీటి వల్ల పనులు ప్రారంభం కాలేదంటూ చెప్పారు.

● ఎంపీ.. ఎమ్మెల్యేలు లేరా..!



జిందాల్ నిర్వాసితులమైన తాము 46 రోజులుగా రోడ్డుపై ఆందోళన చేస్తున్నా, తమ ఓట్లతో అధికారం అనుభవిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు ఎక్కడున్నారు... అంటూ జిందాల్ నిర్వాసితులు మంగళవారం ఇలా ఫ్లెక్సీలు ప్రదర్శిస్తూ ఆందోళన చేపట్టారు. బొడ్డవరలో వీరు ఇలా నిరసన చేయడం అందరినీ ఆలోచింపజేసింది.
– శృంగవరపుకోట

కక్ష సాధింపుతోనే పింఛన్ల తొలగింపు

- మంత్రి అనుమతితోనే ఇలా..
- ఎరువులు లభించక అన్నదాత అవస్థలు
- మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం రూరల్: నియోజకవర్గంలోని దత్తిరాజేరు, గంట్యాడ, గజపతినగరం తదితర మండలాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణుల కుటుంబ సభ్యుల పింఛన్లు తొలగించడం శతశాతం కూటమి ప్రభుత్వం కక్ష సాధింపేనని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ధ్వజమెత్తారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేయకపోగా ఉన్న వారికి తొలగించి కక్షపూరిత పాలన సాగించడం జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు తగదని, పింఛన్లు సంబంధించిన పూర్తి అధికారం ఆయనకు ఉన్నంత మాత్రాన ఇలా చేయడం తగదని పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ఐదు లక్షల మందికి పింఛన్లు తొలగించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. నియోజకవర్గంలో ఎప్పుడూ ఒక్క మాట కూడా మాట్లాడకుండా జిల్లా కేంద్రంలోనూ.. అమరావతిలోనూ.. మాట్లాడుతున్న మంత్రికి నియోజకవర్గ ప్రజల కష్టసుఖాలు ఎప్పుడు తెలుస్తాయన్నారు. నేడు అన్నదాతకు ఎరువులు దొరకని పరిస్థితి నెలకొందన్నారు. బ్లాక్ మార్కెట్లోకి పుష్కలంగా ఎరువులు వస్తున్నా సంబంధిత అధికారులు, కూటమి నాయకులు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. గడిచిన ఐదేళ్లలో గ్రామ స్వరాజ్యం పేరుతో ప్రజలకు ముంగిటకే పాలన సాగించడం జరిగిందన్నారు. నేడు కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది కాలంలోనే పాలన అస్తవ్యస్తం అయ్యిందన్నారు. ఏ కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో ఎవరిమీద కేసు పెడదామా...ఎలా ఇబ్బందులు పెడదామా.. అంటూ పాలన సాగిస్తున్నారే తప్ప సంక్షేమం, అభివృద్ధి జాడలేదన్నారు. డైవర్షన్ రాజకీయాలు చేయడమే తప్ప కూటమి ప్రభుత్వానికి పాలన చేయడం చేతకావడం లేదన్నారు. ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఏమయ్యాయో చెప్పాలన్నారు. ఆయన వెంట గజపతినగరం, దత్తిరాజేరు జెడ్పీటీసీలు గార తవుడు, రౌతు రాజేశ్వరి, జిల్లా వ్యవసాయ సంఘం అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు బి.వెంకటరావు, మండల నాయకులు మండల సురేష్, కరణం ఆదినారాయణతో పాటు పలువురు ఉన్నారు.

జ్వరాలు ప్రబలకుండా చర్యలు చేపట్టండి


మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటనర్సమ్మ

చీపురుపల్లి: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో జ్వరాలు వ్యాప్తి చెందకుండా వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బందితో పాటు పంచాయతీ స్థాయిలో ఉండే అధికారులు, సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో మంగళవారం మండలంలోని అన్ని పంచాయతీల ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, పంచాయతీ కార్యదర్శులతో జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీషతో కలిసి ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాల్లో జ్వరాలు తీవ్రత చాలా ఎక్కువగా ఉందన్నారు. ప్రతీ గ్రామంలోనూ జ్వరాలు బారిన పడి ఎంతో మంది మంచాన పడి ఉన్నారని చెప్పారు. జ్వర తీవ్రతతో విశ్వనాథపురంలో ఓ చిన్నారి మృతి చెందిన సంఘటన అందిరికీ తెలిసిందేనన్నారు. అయితే వర్షాలు కురిసే సమయంలో సీజనల్ వ్యాధులు రావడమే సహజమేనని ఆ జ్వరాలను వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ముందుగానే చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోతే సీజనల్ జ్వరాలు కాస్త విషజ్వరాలుగా మారి ప్రాణాంతకంగా మారుతుందన్నారు. గ్రామ స్థాయిలో ఉండే ఆశా వర్కర్లు ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించాలన్నారు. జ్వరాలు వ్యాప్తి చెందకుండా పంచాయతీ కార్యదర్శులు ఆయా గ్రామాల్లో పారిశుధ్య పనులు నిర్వహించాలని చెప్పారు. సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందులను పీహెచ్‌సీల్లో సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, ఇన్‌చార్జి ఎంపీడీవో ఐ.సురేష్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, వైద్య ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పీఏసీఎస్‌గా జమ్ముపేట

గుర్ల: మండలంలోని జమ్ము పేట సొసైటీ (పీఏసీఎస్) ఉత్తమ సొసైటీగా ఎంపికైంది. ఉత్తమ సొసైటీ అవార్డును విజయవాడలో వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు చేతుల మీదగా సోమవారం అందుకున్నట్టు సొసైటీ సీఈవో ఎం.ప్రసన్నకుమారి మంగళవారం తెలిపారు. సొసైటీలో రికార్డులు నిర్వహణ, రైతులకు అవసరమైన సేవలను సకాలంలో అందించడంతో ఉత్తమ సొసైటీగా ఎంపికైందని ఆమె తెలిపారు.

రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న యువత

గజపతినగరం రూరల్: డాక్టర్ బీఎస్ఆర్ మూర్తి ద్వితీయ వర్ధంతి సందర్భంగా బీఎస్ఆర్ ఆసుపత్రిలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి చైర్మన్ బెల్లాన లక్ష్మీనరేన్, లయన్స్ క్లబ్ సభ్యులు పీటీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తలు ప్రజలతో మమేకం కావాలి

దత్తిరాజేరు: గ్రామాల్లో పని చేస్తున్న ఆశ కార్యకర్తలు ప్రజలతో మమేకం కావాలని దత్తిరాజేరు పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటరమణ అన్నారు. ఆసుపత్రి ఆవరణలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో తగు పరిశుభ్రత చర్యలు చేపట్టేలా ప్రజలను చైతన్యం చేయాలన్నారు.

బీఎల్‌వోల జాబితాలు అందివ్వండి


సమావేశంలో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

- బీఎల్‌వోల జాబితాలు అందివ్వండి

గజపతినగరం: గజపతినగరం నియోజకవర్గంలో మండలాల వారీగా ఉన్న బీఎల్‌వోల జాబితాలను వారి వివరాలను త్వరగా సమర్పించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీలాగాంధీ కోరారు. గజపతినగరం తహసీల్దార్ కార్యాలయంలో ఆమె వివిధ రాజకీయ పార్టీ నేతలతో మంగళవారం సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. గతంలో గజపతినగరం నియోజకవర్గంలో 264 పోలింగ్ స్టేషన్‌లు ఉండేవని, ప్రస్తుతం వాటిని 267కి పెంచడం జరిగిందన్నారు. 1237 మంది ఓటర్లు ఉన్న చోట ఒక కొత్త పోలింగ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆమె చెప్పారు. అభ్యంతరాలు ఉంటే తక్షణమే తెలియజేయాలని సూచించారు. ఓటర్ల జాబితాలోను తప్పులుతడకలు దొర్లినా, మార్పులు చేర్పులు ఉంటే తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి బూడి వెంకటరావు, బీజేపీ నుంచి భాస్కరరావు, కె.తవుడు, సీపీఐ నుంచి పురం అప్పారావు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలను నిలదీయాలి


తానవరంలో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న గొర్లె రవికుమార్

జామి: చంద్రబాబునాయుడు మోసాలను ప్రజలు నిలదీయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొర్లె రవికుమార్ అన్నారు. మండలంలోని తానవరం గ్రామంలో మంగళవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి చంద్రబాబు ప్రజలకు చేసిన మోసాలను వివరించారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన తరువాత హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసాడన్నారు. కూటమి నేతలు గ్రామాల్లోకి వస్తే చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయమని నిలదీయాలన్నారు. ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి వంటి పథకాలు అమలు చేయలేదని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సబ్బవరపు అరుణ, నేతలు అప్పాన సుబ్రమణ్యం, కిలారి సూర్యారావు, శిరికి నాగేశ్వరరావు, గొర్లె అప్పలనాయుడు, జైరాం, కె.అప్పలనారాయణ, ఎస్.రమణ తదితరులు పాల్గొన్నారు.

వరి పంటలో కాలిబాటలు తీసుకోవాలి

జామి: వరి పంటలో గాలి వెలుతురు తగిలే విధంగా కాలిబాటలు తీసుకోవాలని వ్యవసాయాధికారి పూర్ణిమ తెలిపారు. మండలంలోని కుమరాం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరినాట్లు వేసేటప్పుడు నారు కొనలు తుంచి నాటాలని అన్నారు. దీని వలన ఆకుముడత పురుగు నివారణ అవుతుందన్నారు. వరి పంట బీమా ఎకరాకు 200 ఆగస్టు 15లోగా చెల్లించుకోవాలన్నారు. రైతులు పండించిన పంటలకు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని అన్నారు. ఈ క్రాప్ వలన కలిగే ప్రయోజనాలు తెలిపారు. ఎరువులు యాజమాన్యం తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో వీఏఏ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలుపు నివారణతో అధిక దిగుబడులు


వరి పంట దిగుబడులపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త లక్ష్మణ్

గుర్ల: వరి పంటలో కలుపు నివారణ వేగవంతంగా చేయడం వలన అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయ శాస్త్రవేత్త కె.లక్ష్మణ్ రైతులకు సూచించారు. మండలంలోని చింతలపేట రైతులతో ఆయన వరి పంట దిగుబడులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం అవగాహన కల్పించారు. వరి మడులలో కాలిబాటలు వేయాలని సూచించారు. అనంతరం రెడ్డీస్ ఫౌండేషన్ అందించిన వరి పంట పెరుగుదల మందులను రైతులకు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధి మంత్రి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యం ట్రాఫిక్ అవస్థలు


వాహనాలతో రద్దీగా ఉన్న ఆర్‌వోబీ

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి రైల్వే ఓవర్ బ్రిడ్జిపై నిత్యం ట్రాఫిక్ అవస్థలతో వాహన ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌వోబీ వద్ద నిత్యం భారీ వాహనాలైన లారీలు నిలిచిపోతున్న కారణంగా ట్రాఫిక్ రద్దీ పెరిగిపోయి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గరివిడి ఫేకర్ కర్మాగారం, మోర్ కంపెనీకి చెందిన లారీలు, అదే విధంగా మెరకముడిదాం మండలంలో ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలకు చెందిన లారీలు, దత్తిరాజేరు మండలం పోరలి నుంచి క్వార్ట్జ్ తరలించే లారీలు సైతం ఈ ఆర్‌వోబీ మీదుగానే వెళ్లాల్సిన పరిస్థితి. ఈ వాహనాలు నిత్యం రాకపోకలు సాగించే క్రమంలో ఆర్‌వోబీ వద్ద టర్న్ తీసుకునేందుకు చాలా సమయం పడుతుంది. ఈ క్రమంలో విజయగరం నుంచి చీపురుపల్లి వైపు వెళ్లే వాహనాలు గాని, చీపురుపల్లి వైపు నుంచి విజయనగరం వెళ్లే వాహనాలైన బస్సులు, కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలకు ట్రాఫిక్ అవస్థలు ఎదురవుతున్నాయి. లారీలు టర్న్ తీసుకుని వెళ్లే వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. ఈ సమస్యతో ప్రయాణికులు నిత్యం ట్రాఫిక్ కష్టాలు ఎదుర్కొంటున్నారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి


చీపురుపల్లి: విద్యుత్ ఉపకేంద్రం వద్ద ప్లకార్డులతో నిరసన


విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ప్రజావేదిక సభ్యులు

గజపతినగరం రూరల్:

స్మార్ట్ మీటర్లను తక్షణమే రద్దు చేయాలని ప్రజావేదిక జిల్లా అధ్యక్షుడు పురం అప్పారావు డిమాండ్ చేశారు. మంగళవారం వేదిక సభ్యులతో కలసి విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కొన్నిచోట్ల అదాని స్మార్ట్ మీటర్లు బిగింపు ప్రారంభించిందని, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా అదే బాటలో ప్రయాణం చేస్తుందన్నారు. అదాని స్మార్ట్‌మీటరు బిగించిన నాటి నుంచి ప్రజలకు తీరని కష్టాలు ఎదురవుతయన్నారు. వీటిని రద్దు చేసేవరకు తమ పోరాటం ఆగదన్నారు. ధర్నాలో వి.లక్ష్మీ, డి.సింహాద్రి, టి.పైడపునాయుడు, ఆర్.నాగేశ్వరరావు, అచ్చియ్యమ్మ, సత్యం, రమణ, సోమేషు, శిరీష తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లిలో..

చీపురుపల్లి: స్మార్ట్ మీటర్లు విషయంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ మాట మార్చడం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి టివి.రమణ అన్నారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పట్టణంలోని 3/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రం వద్ద మంగళవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్మార్ట్ మీటర్లు మాకొద్దంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. వీటి వల్ల విద్యుత్ శాఖలో ఉపాధి అవకాశాలు కూడా తగ్గిపోతాయన్నారు. సీఐటీయూ డివిజన్ కార్యదర్శి అంబల్ల గౌరునాయుడు, ప్రతినిధులు జంపన విశ్వనాధరాజు, ఉత్తరావల్లి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద ఆందోళన

లక్కవరపుకోట/కొత్తవలస: ప్రభుత్వం నూతనంగా చేపట్టిన విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగింపును తక్షణమే ఆపేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కొత్తవలస, లక్కవరపుకోట మండల కేంద్రాల్లో గల విద్యుత్ సబ్‌స్టేషన్‌ల వద్ద మంగళవారం ఆందోళనలు నిర్వహించారు. సీఐటీయూ నాయకులు గొంప రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దు..

వేపాడ: అదానీ స్మార్ట్ మీటర్లు మాకొద్దు.. ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపొద్దు అంటూ సీపీఎం నాయకులు జాకేరు సబ్‌స్టేషన్ వద్ద ప్రజావేదిక ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నేత శ్యామ్, రైతు సంఘం నేత జగన్, పలు అనుబంధ సంఘాల సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

నమ్మించి మోసం చేశారు..: మాజీ ఎంపీ బెల్లాన


మాట్లాడుతున్న మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: ఎన్నికల ముందు ఎన్నో చేస్తామని చెప్పారు, గత ప్రభుత్వం కంటే మరెంతో ఎక్కువ సంక్షేమం చేస్తామని నమ్మబలికారు.. అందరూ నమ్మి కూటమికి ఓట్లు వేసి మోసపోయారు.. మళ్లీ ఇలాంటి నాయకులను నమ్ముతారా అని మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ప్రశ్నించారు. మండలంలో పి.కె.పాలవలస, బైరెడ్డిపేట గ్రామాల్లో మంగళవారం బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఆయన మాట్లాడుతూ నమ్మించడం మోసం చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అలవాటన్నారు. సూపర్ సిక్స్ పేరుతో ఎన్నో హామీలు ఇచ్చి ఏడాది పూర్తయినా.. ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు కావడం లేదన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు మీసాల వరహాలనాయుడు, రాష్ట్ర రైతు విభాగం జాయింట్ సెక్రటరీ దన్నాన జనార్దనరావు, రెల్లి వెంకటేష్, బైరెడ్డి లక్ష్మణ పాల్గొన్నారు.